**124వ అధ్యాయం**

## ١٢٤ - بَابُ النَّهْيِ عَنِ افْتِرَاشِ جُلُودِ النُّمُورِ وَالرُّكُوبِ عَلَيْهَا

## చిరుత తోలుమీద కూర్చోరాదు, దాన్ని వాహనంమీద ఆసనంగా కూడా ఉపయోగించరాదు

٨١١ - عن مُعَاوِيَةَ رضيَ اللهُ عنه قالَ: قال رسُولُ اللهِ ﷺ: «لا تَرْكَبُوا الخَزَّ وَلَا النِّمَارَ». حديث حسن، رواهُ أبو داود وغيره بإسنادٍ حسنٍ.

811. హజ్రత్ ముఆవియా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు : మీ వాహన ఆసనాల మీద పట్టువస్త్రాలు, చిరుత తోళ్లు ఉపయోగించకండి. (అబూ దావూద్, తదితరులు దీనిని ప్రామాణికమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

*(సుననె అబూ దావూద్‌లోని వస్త్రధారణ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

ఈ హదీసులో 'ఖజ్' అనే పదం వాడబడింది. ఖజ్ అంటే ఉన్ని మరియు పట్టు కలిపి తయారు చేయబడిన వస్త్రమని కొందరు పండితులు అంటున్నారు. ఇలా అనేవారు ఖజ్ అనే వస్త్రాన్ని వాడుకోవటం ధర్మసమ్మతమేనని చెబుతారు. వీరి అభిప్రాయం ప్రకారం ఆ కాలంలో ముస్లిమేతర శ్రీమంతులు, పరలోక విస్మయకారులు తమ దర్పాన్ని ప్రదర్శించటానికి అలాంటి వస్త్రాలే ధరించేవారు. అలాంటి సమయంలో ముస్లింలు వారిని అనుకరించకుండా ఉండాలన్నదే ఈ వారింపు ఉద్దేశ్యం. పై హదీసుని ఈ అర్థంలో తీసుకుంటే, ఖజ్ వస్త్రాలు ధరించటం అవాంఛనీయమైనవిగా మాత్రమే పరిగణించబడుతుంది. కాని ఒకవేళ ఖజ్‌ను అసలైన పట్టువస్త్రమనుకుంటే, అలాంటప్పుడు ఖజ్ వస్త్రాలు ధరించటం నిషిద్ధంగా పరిగణించ బడుతుంది. చాలా మంది పండితులు ఖజ్ అంటే స్వచ్ఛమైన పట్టు అనే భావిస్తున్నారు.

ఏది ఏమైనా పట్టుతో నేయబడిన జీను ఉపయోగించటం, పట్టు అంబారీల మీద కూర్చోవటం ధర్మసమ్మతం కాదని ఈ హదీసు ద్వారా బోధపడుతోంది. అదేవిధంగా చిరుతపులి **తోలుతో** చేయబడిన జాకెట్లు, ఇతర వస్త్రాలు ధరించటం కూడా ధర్మసమ్మతం కాదు.

٨١٢ ـ وعن أبي المَلِيح عن أبيه، رضيَ اللهُ عنه، أَنَّ رسُولَ اللهِ ﷺ نَهى عَنْ جُلُودِ السِّبَاعِ. رواهُ أبو داود، والترمذيُّ، والنسائيُّ بأَسَانيدَ صحاحٍ. وفي روايةِ الترمذي: نَهى عَنْ جُلُودِ السِّبَاعِ أَنْ تُفْتَرَش.

812. హజ్రత్ అబుల్ మలీహ్ తన తండ్రి నుండి చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) క్రూర మృగాల తోళ్ళను ఉపయోగించ రాదని వారించారు.

(అబూ దావూద్, తిర్మిజీ, నసాయిలు దీనిని ప్రామాణికమైన ఆధారాలతో ఉల్లేఖించారు).

తిర్మిజీలోని వేరొక ఉల్లేఖనంలో, "క్రూర మృగాల తోళ్ళపై కూర్చోవద్దని వారించారు" అని ఉంది.

## ముఖ్యాంశాలు

ఈ హదీసు భావం ఇంతకు ముందు వివరించబడిన హదీసు భావం కన్నా విస్తృతంగా ఉంది. ఇందులో అన్నిరకాల క్రూరమృగాల తోళ్ళ వాడకాన్ని, వాటితో ప్రయోజనం పొందటాన్ని నిషేధించటం జరిగింది. క్రూరమృగాల తోళ్ళను ఎంత పరిశుభ్రం చేసినా వాటి వెంట్రుకలు అశుద్ధంగానే ఉంటాయనీ, అందుకే వాటి వాడకం నిషేధించబడిందనీ కొంతమంది పండితులు అభిప్రాయపడ్డారు. మరికొంతమంది ఈ నిషేధం పరిశుభ్రం చేయబడని తోళ్ళకు సంబంధించినదని అన్నారు. ఇంకొంతమంది పండితులు ఈ హదీసు గురించి వ్యాఖ్యానిస్తూ, "గర్విష్టులు, అహంకారులు క్రూర మృగాల తోళ్ళతో చేయబడిన బట్టలు ధరిస్తారు. కనుక ముస్లింలను వారిని అనుకరించకుండా ఉంచాలన్నదే ఈ నిషేధం ఉద్దేశ్యం" అని అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా అల్లామా షౌకానీ (రహ్మాలై) చెప్పిన మాటలు గమనార్హమైనవి. ఆయన ఇలా అన్నారు :

"ఈ హదీసులోని వారింపు విస్తృతార్థంలో ఉంది. అంటే క్రూరమృగాల తోళ్ళు - అవి పరిశుభ్రం చేయబడినవయినా, చేయబడనివయినా వాటి వాడకం నిషిద్ధం. ఈ హదీసు "పరిశుభ్రం చేస్తే ఏ చర్మమయినా పరిశుభ్రమయిపోతుంది" అన్న హదీసు పరిధిలోకి రాదు. ఇందులోని నిషేధాజ్ఞే ఓ ప్రత్యేకమైన ఆదేశం. కనుక క్రూరమృగాల చర్మాలు ఎట్టి పరిస్థితుల్లోనయినా అశుద్ధంగానే ఉంటాయి. వాటిని ఉపయోగించటం ధర్మసమ్మతం కాదు.